సాక్షి
సంగారెడ్డి
గురువారం । 1 । జూన్ । 2023



పంటమార్పిడితోనే భూసార వృద్ధి
ఒకేరకమైన పంట సాగుతో పోషకాలు తగ్గి మొక్కల ఎదుగుదల ఉండదని, ఆ పంట రోగాలను బారిన పడుతుందని, పంటమార్పిడి పాటించాలని నిపుణులు చెబుతున్నారు. 8లో



బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం
బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. సంక్షేమ పథకాలు అమలు సీఎం కేసీఆర్‌తో సాధ్యమన్నారు. 9లో

అందరికీ నెగెటివ్
పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి లో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 12 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 11 మందికి నిర్వహించినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

పొగాకు వాడకాన్ని నిషేధిద్దాం



పొగాకు వాడకంపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ రత్న ప్రసాద్

కొండాపూర్(సంగారెడ్డి): పొగాకు క్యాన్సర్ కారకమని, పూర్తిగా నిషేధించాలని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రత్న ప్రసాద్ అన్నారు. బుధవారం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓ సహకారంతో ప్రపంచ పొగాకు వాడక నిరోధ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత పొగాకు వాడకానికి దూరంగా ఉండాలన్నారు. పొగాకు వినియోగించినా, పొగ పీల్చినా అత్యంత ప్రమాదకరమన్నారు. తారా ప్రభుత్వ కళాశాల పొగాకు రహిత కళాశాలగా గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పొగాకు వాడక నియంత్రణ జిల్లా అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, టీబి నియంత్రణ జిల్లా అధికారి అరుణ, నర్సింహులు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ వెంకటేశం, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జగదీశ్వర్, జిల్లా అధికారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ సాధించిన రాజయ్యకు సన్మానం



రాజయ్యను సన్మానిస్తున్న సంజీవరెడ్డి తదితరులు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ సాహితీ మిత్ర మండలి అధ్యక్షుడు, కల్హేర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు పండిట్ వడ్ల రాజయ్యకు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు లిటరేచర్ విభాగంలో డాక్టరేట్ ప్రదానం చేసింది. బుధవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి తన నివాసంలో ఆయనను ఘనంగా సన్మానించారు. తెలుగు బాషాభివృద్ధి, అష్టావధానాలతో తెలుగు బాషకు ప్రాచుర్యాన్ని కల్పిస్తూ డాక్టరేట్ సాధించడం ఈ ప్రాంతానికి గర్వకారణమని రాజయ్యను అభినందించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ స్వప్న



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ స్వప్న

హత్నూర(సంగారెడ్డి): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను హత్నూర మండలంలో ఈనెల 21 వరకు ఘనంగా నిర్వహించేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో స్వప్న అన్నారు. బుధవారం హత్నూర మండల పరిషత్ కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దశాబ్ద ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 21 రోజుల ఉత్సవాల ప్రణాళికను క్రమం తప్పకుండా గ్రామాల్లో నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ శారద, ఎంపీఓ సువర్ణ, అధికారులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలి

సంగారెడ్డి టౌన్: పద్మశాలి ఆత్మగౌరవ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని బుధవారం కలెక్టర్ శరత్‌కు ఎస్‌హెచ్‌డీసీ చింతా ప్రభాకర్‌తో కలిసి పద్మశాలి సంఘం నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పద్మశాలి ఆత్మగౌరవ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందచేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లీ.. నీకు ప్రణమిల్లి



జనార్దన్ రెడ్డి, మండప నిర్మాణ కర్త

దౌల్తాబాద్ చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహ మండపం

- ఉద్యమాల అడ్డా దౌల్తాబాద్ చౌరస్తా
- ఆలయాన్ని తలపించే తెలంగాణ తల్లి మండపం
- రాష్ట్రానికే తలమానికం
- రాష్ట్రం కోసం ఐదుగురి ఆమరణ నిరాహార దీక్ష

హత్నూర(సంగారెడ్డి): తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి అదో అడ్డా. ఆ ప్రాంతానికి చేరుకోగానే యథాలాపంగా చూపు మరలుతుంది. అక్కడ కనిపించిన నిర్మాణాన్ని చూడగానే ఆశ్చర్యం వేస్తుంది. అది మందిరమా, మండపమా అని మనల్ని మనమే ప్రశ్నించుకునేలా చేస్తుంది. పరీక్షించి చూశాక ఔరా అనిపిస్తుంది. అదే హత్నూర మండలం దౌల్తాబాద్ కాసాల చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహం, అక్కడ ఉన్న మండపం రాష్ట్రానికే తలమానికం. తెలంగాణ తల్లి మండపానికి సంబంధించిన విశేషాల సమాహారం రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

- తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా దేవాలయాన్ని తలపిస్తోంది ఇక్కడి తెలంగాణ తల్లి విగ్రహం మండపం.
- తెలంగాణ ఉద్యమంలో ఎందరో ఉద్యమకారులకు అడ్డుగా నిలిచిన దౌల్తాబాద్ చౌరస్తాలోని ఈ మందిరం ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది.
- సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్ (కాసాల) నర్సాపూర్ సంగారెడ్డి ప్రధాన రహదారి చౌరస్తాలో 2010 సెప్టెంబర్ 15న అప్పటి ఉద్యమకారుడు ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆలయాన్ని తలపించే మండపంలో ఆవిష్కరించారు.
- మండప నిర్మాణం కోసం హత్నూర మండలం దేవులపల్లి గ్రామానికి చెందిన టీఆర్ఎస్ పార్టీ అప్పటి రాష్ట్ర దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు దివంగత పొట్టి జనార్ధన్ రెడ్డి శ్రీకారం చుట్టారు.
- రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మండపం నిర్మించాలని లక్ష్యంతో చాలా ప్రాంతాలకు వెళ్లి తెలంగాణ తల్లి విగ్రహాన్ని పరిశీలించారు.
- మందిరాన్ని తలపించే విధంగా చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కేసీఆర్ సమక్షంలో డిజైన్ ఎంపిక చేశారు.
- ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న తరుణంలో దీని నిర్మాణానికి జనార్దన్ రెడ్డి దాతల సహకారంతో రూ.లక్షలు వెచ్చించి తెలంగాణ తల్లి విగ్రహాన్ని సుందరమైన మండపంలో ఏర్పాటు చేశారు. దీన్ని కేసీఆర్ అట్టహాసంగా ఆవిష్కరించారు.
- ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ తల్లి విగ్రహం మండపం మందిరాన్ని తలపించేలా ఉండటంతో ఎంతో మంది నాయకులు వచ్చి చూసి వెళ్తారు.
- 2011 మార్చి 7వ తేదీ రాత్రి గుర్తుతెలియని దుండగులు తెలంగాణ తల్లి విగ్రహానికి నిప్పు అంటించి కాల్చి బూడిద చేశారు. దీంతో నువ్వు మండలమే కాకుండా జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ఉద్యమకారుల నిరసనలు హోరెత్తాయి. అనంతరం వారంలోనే తిరిగి విగ్రహాన్ని జనార్ధన్ రెడ్డి ఏర్పాటు చేయించారు.

అమరణ నిరాహార దీక్షకు వేదిక.

- తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడాలని హత్నూర మండలానికి చెందిన ఐదుగురు ఉద్యమకారులు ఈ విగ్రహం వద్దే అమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు.
- దివంగత జనార్ధన్ రెడ్డి కుమారుడు చంద్రశేఖర్ రెడ్డి, పల్పనూర్ గ్రామానికి చెందిన డబ్బు గోపాల్, సలీం, సిరిపురం గ్రామానికి చెందిన అప్పటి ఎంపీపీ ఉపాధ్యక్షుడు చెన్న నర్సింలు, కొన్యాల గ్రామానికి చెందిన మారుతి రాజులూ అమర నిరాహార దీక్షలో కూర్చున్న ఉద్యమానికి ఊపిరి పోశారు.
- నాలుగు రోజులు గడిచినా దీక్షలు కొనసాగిస్తున్నడంతో పరిస్థితి విషమంగా మారింది. ఐదో రోజు ఉద్యమ నాయకుడు కేసీఆర్ దీక్షా స్థలానికి వచ్చి వారితో దీక్షను విరమింపజేశారు.

ఉద్యమాల అడ్డా

- తొలినాటి నుంచి చైతన్యవంతమైన ప్రాంతంగా హత్నూర మండలానికి పేరు పెట్టుకుని ఉంది. మలిదశ తెలంగాణ ఉద్యమానికి హత్నూర, దౌల్తాబాద్ చౌరస్తా అడ్డాగా మారిపోయింది. రాస్తారోకోలు బంధువులతో ఈ చౌరస్తా దద్దరిల్లింది.
- తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యం తో ఇక్కడి జనం సలిపిన పోరాటం స్ఫూర్తిదాయకంగా నిలిచింది. తెలంగాణ తల్లి విగ్రహాన్ని నిలబెట్టి మందిరాన్ని తలపించే మండపం నిర్మించిన అప్పటి నుంచి దాని పేరు మారింది.
- ఇప్పుడు తెలంగాణ చౌరస్తాగా కీర్తి కెక్కింది అంటే దాని నిర్మాణం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ఈ చౌరస్తా వద్దకు రాగానే తెలంగాణ తల్లి విగ్రహాన్ని మందిరాన్ని చూడకుండా ఉండలేరు.
- దురదృష్టవశాత్తు దీని నిర్మాణం కోసం కృషి చేసిన జనార్ధన్ రెడ్డి తెలంగాణ రాష్ట్రం అవతరించిన ఏడాదిన్నరకే హఠాత్ మరణం చెందారు. దీంతో ఆయన విగ్రహాన్ని మండపం వద్ద టీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేశారు.

చావడానికి సిద్ధమైన..



తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి చావడానికైనా సిద్ధమైనా. ఐదు రోజులకే ఉద్యమ నాయకుడు కేసీఆర్ స్వయంగా దీక్ష స్థలానికి వచ్చి చస్తే వచ్చేది ఏమీ లేదు, బతికుండి రాష్ట్రాన్ని సాధించుకుందామని నచ్చజెప్పి దీక్ష విరమింపజేశారు. కొద్దిరోజుల తర్వాత నా కల నెరవేరింది. రాష్ట్రం ఏర్పడింది.

– డప్పు గోపాల్, ఉద్యమకారుడు

నాన్న పేరు చిరస్థాయిగా నిలిచి పోయింది



రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ తల్లి విగ్రహం మండపం ఏర్పాటుతో మా తండ్రి స్వర్గీయ జనార్దన్ రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచి పోయింది. రాష్ట్రం ఉద్యమంలో నేను ఐదు రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్షలో కూర్చున్న. నా ఆరోగ్యం క్షీణించింది. కేసీఆర్ వచ్చి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

– ఇంద్ర శేఖర్ రెడ్డి ఉద్యమకారుడు

నా చావుతోనైనా రాష్ట్రం వస్తుందని



ఉద్యమం ఉవ్వెత్తున నడుస్తున్న సందర్భంలో ఆమరణ నిరాహారదీక్ష చేసి నా చావుతోనైనా తెలంగాణ వస్తుందన్న ఆశతో దీక్ష చేశా. ఐదు రోజుల్లో ఉద్యమం ఉవ్వెత్తున లేచింది. అప్పటి ఉద్యమ నాయకుడు ప్రస్తుత సీఎం కేసీఆర్ స్వయంగా మా దీక్ష శిబిరానికి వచ్చాడు. ఇంకా ఉద్యమం ఉధృతం చేశా, మా కల సాకారమైంది. రాష్ట్రం సిద్ధించింది. భవిష్యత్ తరాలకు మేలు జరిగింది.

– చెన్న నర్సింహులు, ఉద్యమకారుడు

క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతి



శుభాకాంక్షలు తెలుపుతున్న సీఐ వేణు గోపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: ముకుందాపురం క్రీడాకరులకు పెట్టింది పేరని పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. సీఎం కప్ టోర్నమెంట్ లో రాష్ట్రస్థాయి వాలీబాల్ విభాగంలో నల్గొండ జిల్లా బాలికల జట్టు వరంగల్ జిల్లా జట్టుపై గెలిచి ప్రథమ స్థానంలో నిలిచింది. సమాచారం తెలుసుకున్న పటాన్‌చెరు సీఐ హైదరాబాద్ ఎల్బీనగర్‌లో క్రీడాకారులను కలసి రూ.10 వేల నగదు బహుమతి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కప్ వాలీబాల్ పోటీలలో విజేతగా నిలిచిన నల్గొండ జట్టులో ఆరుగురిలో ఐదుగురు ముకుందాపురం వాసులేనన్నారు. నల్గొండ జిల్లా నిడమానూరు మండలం ముకుందాపురం క్రీడాకారులకు పెట్టింది పేరన్నారు. ఇదే గ్రామానికి చెందిన తాను 1997 లో హైదారాబాద్ హెచ్‌సీఏ జట్టుతో కలసి శ్రీలంక కొలంబలో జరిగిన క్రికెట్ మ్యాచ్‌కు జట్టు సభ్యుడిగా ఎన్నికయ్యానని అప్పట్లో ముకుందపురం గ్రామానికి గుర్తింపు వచ్చిందన్నారు. అదేవిధంగా ఇదే గ్రామానికి చెందిన వినోద్,వంగల ధనుష్ కూడా మారథాన్ లో జాతీయస్థాయిలో పేరొందారని గుర్తుచేశారు. ఇప్పుడు మరోసారి గ్రామానికి రాష్ట్రస్థాయి గుర్తింపు తెచ్చారు. సీఎం కప్ టోర్నమెంట్‌లో రాష్ట్ర స్థాయి వాలీబాల్ విభాగంలో నల్గొండ జట్టు బాలికలు ప్రథమ స్థానంలో నిలిచింది. రామ్ కావ్య, ఎస్‌కె నాగురా, రామ్, రమ్య, ఫరీనా, రేణుక ముకుందాపురం గ్రామస్తులు, మరో విద్యార్థి లావణ్య ముకుందాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో చదివిందన్నారు.

జూన్ 8 నుంచి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

సంగారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 8 నుంచి 10వ తేదీ వరకు ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి సతీష్ బుధవారం తెలిపారు. ఈ ఫెస్టివల్లో 10 నుంచి 15 స్టాల్స్ ఏర్పాటు చేసి వివిధ రకాల చేపలు, రొయ్యలతో ప్రత్యేకంగా తయారు చేసిన వంటకాలను విక్రయించబడుతుందని, ఆసక్తి కలిగిన వారు జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో జూన్ 4 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 8వ తేదీన జిల్లాల్లో గల మధ్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు, మహిళలు బతుకమ్మలతో గ్రామాల్లో చెరువుల పండుగను నిర్వహించాలన్నారు.

ప్రత్యేక బస్సులు నడపాలి

సంగారెడ్డిటౌన్: రోడ్డు రవాణా సంస్థ మెదక్ రీజియన్ సుదర్శన్ బుధవారం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముదిమాణిక్యం మీదుగా పోచారం, జోగిపేట నుంచి పోతిరెడ్డిపల్లి మీదుగా బస్వాపూర్ నుంచి పోచారం వరకు, మల్లికార్జునపల్లికి బుదేరా నుంచి వయా మునిపల్లి మీదుగా సంగారెడ్డికి, తాండూర్‌కు, అలాగే రాయికోడ్ మండలం మహ్మదాపూర్ నుంచి , ఎమ్ఎన్ఆర్ మీదుగా బస్సులను నడపాలంటూ ప్రజలు కోరారు. ఆర్ఎం స్పందిస్తూ వీటికి త్వరలోనే ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి పరిష్కారం చేస్తామన్నారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

కలెక్టర్ డాక్టర్ శరత్



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత శాఖల అధికారులతో ధాన్యం కొనుగోళ్లు, తదితర విషయాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీరోజు 50 లారీలకు తగ్గకుండా కొనుగోలు కేంద్రాలకు పంపాలన్నారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడ్ చేయకుండా జాప్యం చేస్తున్న రైస్ మిల్లర్లపై, రవాణా కాంట్రాక్టర్ల పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్లు, రవాణ, పోలీసు అధికారులు వాహన ఇన్‌స్పెక్టర్లు రేయింబవళ్లు వాహనాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వ లేకుండా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లు చేయాలి

సంగారెడ్డిటౌన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలుసూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తెలంగాణ దేశానికే అన్నపూర్ణ అనే నినాదం వినిపించాలన్నారు. రైతు వేదికల అలంకరణ, దశాబ్ది ఉత్సవాల లోగో ఏర్పాటు, ప్రభుత్వ పథకాల ప్రదర్శన, గీతాలాపన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రైతులు రైతు దినోత్సవానికి తరలివచ్చేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులకు సూచించారు.

పర్యావరణ పరిరక్షణ.. అందరి బాధ్యత

ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ప్రతీఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జూకల్ శివారులోని కన్వెన్షన్ హాల్‌లో బుధవారం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణహిత జీవనశైలిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్యంతో అనేక అనర్థాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులతో కలిసి పర్యావరణహితాన్ని పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీపీఓ సురేష్‌మోహన్, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా దశాబ్ది ఉత్సవాలపై ఎమ్మెల్యే జూకల్‌లోని కన్వెన్షన్ హాల్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు.

వ్యాపారాభివృద్ధిలో కృత్రిమమేధ కీలకం



అక్షయపాత్ర పనితీరు వివరిస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు టౌన్: ఉత్పత్తి అభివృద్ధి ప్రక్రియలను మెరుగుపరచడానికి, మార్కెట్‌ను వేగవంతం చేయడానికి, పోటీతత్వాన్ని పొందేందుకు స్టార్టప్ లు కృత్రిమమేధను వినియోగిస్తున్నాయని ప్రొడక్ట్ డెవలప్‌మెంట్‌లో ప్రముఖ ఇన్నోవేటర్ చైతన్య ముప్పాల చెప్పారు. గీతం వర్సిటీలోని వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ (వీడీసీ) ఆధ్వర్యంలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా, బుధవారం 'కృత్రిమ మేధ భవిత, ఉత్పత్తి అభివృద్ధి మెలకువలు' పై విద్యార్థులకు దిశానిర్దేశనం చేశారు. ఉత్పత్తి అభివృద్ధి భవిష్యత్‌ను అంచనా వేయడానికి బహుళజాతి కంపెనీలు కృత్రిమమేధ (ఏఐ)ను ఎలా వినియోగిస్తారో వివరించారు. భారత్‌లోనూ ఉత్పత్తి అభివృద్ధిలో కృత్రిమమేధ సామర్థ్యాన్ని విరివిగా వినియోగిస్తున్నారని చెప్పారు. ఏఐ అల్గారిథమ్ ద్వారా విస్తారమైన డేటాను వర్ధమాన వ్యవస్థాపకులు ఎలా విశ్లేషించాలో చైతన్య వివరించారు. ఏఐ ఆధారిత విశ్లేషణలను ఉపయోగించడం ద్వారా స్టార్టప్‌లు, ఉత్పత్తి అభివృద్ధిలో మరింత సమాచారంతో నిర్ణయాలు తీసుకోవచ్చని, తద్వారా నిర్దిష్ట వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులను రూపొందించవచ్చని ముప్పాల విశదీకరించారు. యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన, నిర్మాణాత్మక వనరులు, మార్గదర్శకత్వం అందించడం ద్వారా వినూత్న ఆలోచనలను ఆచరణీయ వ్యాపార సంస్థలుగా మార్చడం, వారి అభివృద్ధిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు.

ధాన్యం దించుకోని మిల్లర్లపై చర్యలు

- ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లు రోజూ 50 లారీలు పంపాల్సిందే
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : జిల్లాలో అస్తవ్యస్తంగా సాగుతున్న ధాన్యం కొనుగోళ్ల తీరుపై బుధవారం 'సాక్షి' దినపత్రికలో 'మృగశిర ముంచుకొస్తున్నా..' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ డాక్టర్ శరత్ స్పందించారు. ధాన్యం కొనుగోళ్ల తీరుపై జిల్లా అధికార యంత్రాంగంతో బుధవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం దించుకోకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్న రైసుమిల్లర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లు ప్రతీరోజు 50 లారీలకు తగ్గకుండా కొనుగోలు కేంద్రాలకు పంపి ధాన్యాన్ని రవాణా చేయాలని ఆదేశించారు. మృగశిర కార్తె దగ్గర పడుతున్నప్పటికీ జిల్లాలో సగం కూడా ధాన్యం సేకరణ పూర్తి కాలేదు. ఖరీఫ్ పనుల్లో బిజీకావాల్సిన అన్నదాతలు ధాన్యం విక్రయించేందుకు ఇంకా కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నారు. ఓపిక నశిస్తున్న రైతులు రోడ్డెక్కి రాస్తారోకోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం రైతుల కష్టాలపై 'సాక్షి'లో సమగ్ర కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. తహసీల్దార్లు, సీఐలు, ఎంవీఐలు ప్రత్యేకంగా చొరవ చూపి ధాన్యం రవాణాకు వాహనాలను ఏర్పాట్లు చేయాలన్నారు. రైసుమిల్లుల్లో లారీలను వెంట వెంటనే ధాన్యం దించుకునేలా సూపర్ వైజర్లు పర్యవేక్షించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, సంబంధిత శాఖల అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పారిశ్రామిక రంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 6వ తేదీన నిర్వహించనున్న పారిశ్రామిక ప్రగతి ఉత్సవంపై పరిశ్రమల శాఖ అధికారులతో బుధ వారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక సంస్కరణల మూలంగా జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలకు రాష్ట్రం కేంద్ర బిందువుగా మారిందన్నారు. రాష్ట్రం ఏర్పడక ముందు గత ప్రభుత్వాల నిర్లక్ష్యం మూలంగా పారిశ్రామిక రంగం తీవ్ర ఒడిదుడుకులకు లోనవడంతో వేలాదిమంది కార్మికుల ఉపాధి కోల్పోవడంతో పాటు భారీ పరిశ్రమలు మూసివేయబడ్డాయని తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో పారిశ్రామిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని వివరించారు. నియోజకవర్గ పరిధిలో పారిశ్రామిక రంగంలో చేపట్టిన ప్రగతిని ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ప్రశాంత్, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ అనురాధ, అసిస్టెంట్ డైరెక్టర్ వెంకయ్య, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈలు గీత, పటాకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరువు నష్టం కేసు నమోదు

కొండపాక(గజ్వేల్): కాల్వ తవ్వకం పనుల విషయంపై ఓ కంపెనీ ఉద్యోగి మాచర్ల సంపత్ కుమార్‌పై పరువునష్టం కేసు నమోదు చేశామని కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి కాల్వ ద్వారా నీరు వెళ్లేందుకు కోనాయిపల్లి, మంగోల్, మాత్‌పల్లి, మేదినీపూర్, లకుడారం, తపాస్‌పల్లి గ్రామాల్లోని రైతులు పట్టా భూములు కోల్పోతున్నారు. టెండర్ ద్వారా కాల్వ పనులు దక్కించుకున్న సాయి దత్త కంపెనీ నిర్వాహకులు 2022 డిసెంబర్‌లో పరిహారం విషయమై రెవెన్యూ అధికారులతో లకుడారంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. రైతులకు నష్ట పరిహారం అందించాకే కాల్వ తవ్వకం పనులు చేయాలంటూ వైస్ ఎంపీపీ దేవి రవీందర్ గ్రామ సభలో రైతుల పక్షాన మాట్లాడారు. అయితే సాయిదత్త కంపెనీ ఉద్యోగి సంపత్ కుమార్ ఈ పనుల విషయమై గొడవలు జరగకుండా దేవి రవీందర్‌కు కొంత డబ్బు ముట్టజెప్పామంటూ బాధిత రైతుల్లో ఒకరికి చెప్పి అప్రతిష్ట పాలు చేశారన్నారు. దీంతో విషయం తెలుసుకున్న దేవి రవీందర్ తనను అప్రతిష్ట పాలు చేస్తున్నారనే నెపంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇల్లు కూల్చిన ఘటనలో..

నంగునూరు(సిద్దిపేట): ఇంటిని కూల్చివేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్టు రాజగోపాల్‌పేట ఎస్‌ఐ రాజుగౌడ్ తెలిపారు. వెంకటాపూర్ గ్రామానికి చెందిన రంగు మల్లవ్వ ఉపాధి కోసం కొన్ని సంవత్సరాల కిందట హైదరాబాద్‌కు వలస వెళ్లింది. ఈ క్రమంలో తన ఇల్లు కూలిపోయే స్థితిలో ఉండడంతో తిరిగి వెంకటాపూరానికి వచ్చి ఇంటిని మరమ్మతు చేయిస్తోంది. అయితే గ్రామానికి చెందిన రేకులపల్లి కోటిరెడ్డి, రేకులపల్లి భాస్కర్‌రెడ్డి, పులిగిల్ల చంద్రయ్య, బొమ్మిడి కరుణాకర్‌రెడ్డి డ్రోజర్ ట్రాక్టర్‌తో తన ఇంటిని కూల్చివేశారని మల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత



మృతి చెందిన గేదె వద్ద బాధిత కుటుంబసభ్యులు

నారాయణఖేడ్: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన మండల పరిధిలోని వెంకటాపూర్ కిషన్ నాయక్ తండాలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కిషన్‌నాయక్ తండాకు చెందిన మూడ్ రమేష్ ఎప్పటిలాగే తన వ్యవసాయ పొలం వద్ద పశువులను మేపుతుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గేదెకు కరెంట్ తీగలు తగిలాయి. దీంతో గేదె అక్కడికక్కడే మృత్యువాత పడింది. గేదె విలువ రూ.70వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు రమేష్ కోరాడు.

హైఓల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం

నారాయణఖేడ్: పట్టణంలోని రాంవిలాస్ వీధిలో మంగళవారం రాత్రి హైఓల్టేజీ కారణంగా పలు ఇళ్లల్లో గృహోపకరణాలు, విద్యుత్ ఉపకరణాలతో పాటు ఓ కొరియర్ సంస్థలో ప్రింటర్, తదితర పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. హైఓల్టేజీ కారణమని గుర్తించి చాలా ఇళ్లల్లో అప్పటికప్పుడు గృహోపకరణాల స్విచ్‌లు ఆఫ్ చేశారు.

పంటమార్పిడితోనే భూసార వృద్ధి

- రోగకారక పురుగుల జీవితచక్రం ఛేదన
- చీడపీడల అభివృద్ధికి అడ్డుకట్ట



పొలం దున్నుతున్న రైతు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఒకేరకమైన పంట సాగువల్ల పోషకాలు తగ్గి మొక్కల ఎదుగుదల ఉండదు. అంతేకాకుండా ఎక్కువగా ఆ పంట రోగాలను బారిన పడుతుంది. అందుకే పంటమార్పిడి తప్పనిసరి అని వ్యవసాయ నిపుణులు, అధికారులు సూచిస్తున్నారు.

పంట మార్పిడి ప్రాధాన్యం:

- ఒక పంటను ఒకే పొలంలో వరుసగా పండించడం వల్ల చీడపీడల ఉధృతి అధికం కావడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి.
- పురుగు జీవితచక్రం నిరాటంకంగా ముగించుకుని తీవ్రమైన హాని కలిగించే స్థితికి చేరుకుంటుంది.
- పంట మార్పిడి చేసినప్పుడు పురుగు జీవిత చక్రం ఛేదించబడుతుంది. ఎందుకంటే ఒక పంటపై ఆశించే పురుగులు మరొక పంటపై ఆశించడం సాధారణంగా జరగదు.
- వేగంగా వృద్ధి చెందే కొన్ని రకాల పురుగులను పంటమార్పిడి వల్ల అదుపులో పెట్టవచ్చు.
- ఒకే లోతు వ్యవస్థ కలిగిన పంటలను ఉదాహరణకు పత్తి, మిరప మొదలైన వాణిజ్య పంటలను మార్పిడి చేయకుండా సాగు చేయడం వల్ల ఒకే లోతు పొరల నుంచి పోషకాలు తీసుకోవడంతో నేల నిస్సారమవుతుంది.
- వరి, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న వంటి పైర్లు నేలపై పొరల నుంచి పోషకాలను తీసుకుంటాయి.
- నేల భౌతిక లక్షణాలు స్వభావం దెబ్బతినకుండా ఉండడానికి చీడపీడల అభివృద్ధిని నిరోధించడానికి పంటమార్పిడి చేయాలి
- అప్పుడప్పుడు అవసరాన్ని బట్టి పశుగ్రాసం కోసం గడ్డిజాతి పైర్లు భూసారాన్ని పెంచడానికి పచ్చిరొట్ట పైర్లు వేసుకోవాలి.

పంట మార్పిడి ప్రయోజనాలు:

- వరి తర్వాత మినుము, పెసర, శనగ, వేయడం వల్ల సుడిదోమ, టుంగ్రో వైరస్ నివారించవచ్చు.
- చెరకు తర్వాత వరి సాగు చేయడం వల్ల వేరు పురుగు, దోమ పోటు నివారించవచ్చు.
- పత్తి వేసిన పొలంలో మొక్కజొన్న, జొన్న, నువ్వులు, మినుము, వేస్తే లద్దె పురుగు, పచ్చపురుగుల బెడద ఉండదు.
- జొన్న, మొక్కజొన్న తర్వాత కంది సాగు చేస్తే కాయతొలుచు పురుగు ఉధృతి తగ్గుతుంది.
- వరి సాగు చేసే పొలాల్లో ముందుగా పప్పుధాన్యాలను సాగు చేయడం వల్ల నేల సారవంతమవుతుంది.
- వేరుశనగలో ఆకుముడతను నివారించేందుకు పప్పుజాతికి చెందిన పైర్లతో మార్పిడి చేయాలి.
- కంది, మిరప పంటల్లో ఎండుతెగులు నివారణకు జొన్న, మొక్కజొన్న పంటలతో మార్పిడి చేయాలి.
- నులి పురుగు సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో వేరుశనగ, మిరప, పొగాకు వంగ పైర్ల సాగును కొన్ని పంట కాలాల వరకు ఆపాలి.

తెగుళ్లకు అడ్డుకట్ట



రైతులు ఎల్లప్పుడు ఒకే రకమైన పంటలను సాగు చేయడం వల్ల ఆ పంట మొక్కలకు అవసరమైన పోషకాలు తక్కువై దిగుబడులు తగ్గిపోతాయి. అంతే కాకుండా రోగకారక పురుగుల జీవితచక్రం ముగించుకుని రోగాల ఉధృతి పెరుగుతుంది. రైతులు అందుకే వరుసగా ఒకే పంటను సాగు చేయకుండా పంట మార్పిడి చేస్తుండాలి. తద్వారా దిగుబడులు పెరిగి మంచి లాభాలను పొందవచ్చు.

– వసంతరావు, జగదేవ్‌పూర్ ఏఓ

- ఆహార పంటలైన వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ పైర్లను పప్పుజాతి పైర్లయిన పెసర, మినుము, వేరుశనగ పంటలతో మార్పిడి చేయాలి.
- ఆహార వాణిజ్య పంటలను పశుగ్రాస పైర్లతో ఒకసారి, పప్పుజాతి పైర్లతో మరోసారి మార్పిడి చేయడం లాభదాయకం.

దశాబ్ది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



బీఆర్‌టీయూ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్‌రూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బీఆర్‌టీయూ ఆటో యూనియన్ ముద్రించిన పోస్టర్‌ను బుధవారం రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య మంత్రి హరీష్‌రావు గజ్వేల్ మండలంలోని రిమ్మనగూడలో ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని దళితబంధు అందని ఆటో డ్రైవర్లకు గృహలక్ష్మి పథకం కింద మూడు లక్షల అందిస్తామని, డ్రైవింగ్ లైసెన్స్‌లు ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. 4 వేల మంది ఆటో కార్మికులకు డ్రెస్సులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారయ్య, ప్రధాన కార్యదర్శి బాలరాజు, నాయకులు సాయిబాబా, ఫరీద్, నరసింహగౌడ్, శ్రీనివాస్, స్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి కింద ఇరుక్కున్న ధాన్యం లారీ



అల్లాదుర్గం వద్ద 161 రహదారి బ్రిడ్జి కింద ఇరుక్కున్న ధాన్యం లారీ

అల్లాదుర్గం(మెదక్): జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నిర్మించి చిన్న బ్రిడ్జితో అందరూ అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి అన్ని కార్యాలయాలకు ఈ బ్రిడ్జి కిందనే వెళతారు. బుధవారం అల్లాదుర్గం కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం లోడ్‌తో వెళుతున్న లారీ బ్రిడ్జి కింద ఇరుక్కుని బస్తాలు కిందపడ్డాయి. గతంలోనూ ఓ ట్రాక్కు సైతం ఇలాగే ఇరుక్కొని తీవ్ర అంతరాయం కలిగింది.

దుబ్బాక ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్

యువకుడి కడుపులోంచి 2.5 కిలోల కొవ్వు తొలగింపు



వైద్యులు తొలగించిన 2.5 కిలోల కొవ్వు



ఆపరేషన్‌లో పాల్గొన్న దుబ్బాక ఆస్పత్రి వైద్యబృందం

దుబ్బాకటౌన్: దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు అరుదైన ఆపరేషన్ చేశారు. బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ ఆధ్వర్యంలో వైద్యులు ఓ యువకుడి కడుపు నుంచి 2.5 కిలోల కొవ్వును తొలగించారు. వివరాల్లోకి వెళితే.. దుబ్బాక మండలం రామక్కపేటకు చెందిన పుట్ట వెంకటేష్ రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా నయం కాలేదు. ఇటీవల అతడిని పరీక్షించిన దుబ్బాక ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి కడుపులో హెర్నియా తరహాలో కొవ్వు పెరిగిపోయినట్లు గుర్తించారు. వెంటనే ఆపరేషన్ చేసి కొవ్వును తొలగించి ప్రాణాలు కాపాడారు. ప్రస్తుతం వెంకటేశ్ ఆరోగ్యం నిలకడగా ఉందని హేమరాజ్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా వైద్యబృందానికి వెంకటేశ్ కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు.

కామన్వెల్త్, ఒలింపిక్స్‌లో రాణించాలి



బాస్కెట్‌బాల్ విన్నర్స్ జట్లతో డాక్టర్ ఆంజనేయులుగౌడ్

శాట్స్ చైర్మన్ ఆంజనేయులుగౌడ్

వెంగళరావునగర్: రాష్ట్రస్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులందరూ భవిష్యత్‌లో కామన్వెల్త్, ఒలింపిక్స్ క్రీడల్లో రాణించాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణా స్టేట్ (శాట్స్) చైర్మన్ డాక్టర్ ఆంజనేయులుగౌడ్ అన్నారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నాలుగు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ మెన్ అండ్ ఉమెన్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సాయంత్రం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంజనేయగౌడ్ మాట్లాడుతూ ఆదివారం నుంచి ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైన చీఫ్ మినిస్టర్ కప్–2023 పోటీల్లో వేలాది మంది వివిధ జిల్లాల నుంచి హాజరయ్యారన్నారు. ఈ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులతో పాటుగా తమ ప్రతిభను చాటుతూ ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో వచ్చిన వారు సైతం మరింతగా శిక్షణ తీసుకుని భవిష్యత్‌కు బంగారుబాటలు వేసుకోవాలన్నారు. యువత తమకు నచ్చిన క్రీడల్లో ట్రైనింగ్ తీసుకుంటే రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురాగలుగుతారన్నారు. అనంతరం ఫైనల్స్‌లో విజయం సాధించిన హైదరాబాద్ మెన్స్ అండ్ ఉమెన్స్ జట్లకు ఆయన ట్రోఫీలను అందించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి డీఆర్‌డీఓ ప్రభాకర్, సంగారెడ్డి డిప్యూటీ ఎస్‌ఓ రామచందర్, స్టేడియం ఇన్‌చార్జి జి.రవీందర్‌లతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు, జీహెచ్‌ఎంసీ, టూరిజం తదితర శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

తల్లీకొడుకు అదృశ్యం



జ్యోతి, పండరి (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: తల్లీకొడుకు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన అశోక్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం అశోక్ డ్యూటీకి వెళ్లే సమయంలో భార్య జ్యోతి, రెండున్నర సంవత్సరాల కుమారుడు పండరి ఇద్దరు ఇంట్లో ఉన్నారు. తిరిగి రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో భార్య, కుమారుడు కనిపించలేదు. భార్య నంబరుకు ఫోన్ చేసి చూడగా స్విచ్ ఆఫ్ వచ్చింది. తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు. అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి మృతి



రబిసింగ్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: పడుకున్న చోటే యువకుడు మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పశ్చిమబెంగాల్‌కు చెందిన రబిసింగ్ (23) రెండు నెలల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు శివారులోని ఏపీఆర్‌లో కాంట్రాక్ట్ లేబర్‌గా పని చేసుకుంటూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం రబీసింగ్ పడుకున్న చోటే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తన తల్లితో అసభ్యంగా ప్రవర్తించాడని...



సంఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న సీఐ వెంకటేశం తదితరులు

వ్యక్తిని హతమార్చిన కొడుకు

ఝరాసంగం(జహీరాబాద్): తన తల్లి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిని కుమారుడు హత్య చేశాడు. పోలీసుల కథనం ప్రకారం...మండల పరిధిలోని జునేగావ్ గ్రామానికి చెందిన ఎల్లయ్య(50) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మహిళ పట్ల ఎల్లయ్య సోమవారం రాత్రి 8 గంటల సమయంలో అసభ్యకరంగా ప్రవర్తించాడు. గమనించిన ఆ మహిళ బావ కుమారుడు దుర్గాప్రసాద్ ఇంటికి తీసుకువెళ్లి కుటుంబ సభ్యులకు చెప్పాడు. మంగళవారం రాత్రి ఎల్లయ్య తన ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న సమయంలో ఆ మహిళ కుమారుడు బి.రమేష్, దుర్గాప్రసాద్‌తో కలిసి కర్రలతో తలపై కాళ్లపై బలంగా కొట్టారు. మృతుడి తలపై బలమైన గాయం కావడంతో ఒక్కసారిగా అరవడంతో గమనించిన కుటుంబ సభ్యులు జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు చెప్పాడు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ రూరల్ సీఐ ఎస్.వెంకటేశం సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి సోదరుడు నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

దుబ్బాకరూరల్: వెంకటగిరి తండాలో ఎంపీపీ కొత్త పుష్పలత కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. పేద ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రుల్లోకి వెళ్లి ఖర్చుల బారిన పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కంటి వెలుగు ఏర్పాటు చేసిందన్నారు. ఈ శిబిరంలో ఉచితంగా కళ్లద్దాలు, మెడిసిన్ ఉచితంగా అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కరశర్మ, సర్పంచ్ పెంటవ్వబాలకిషన్, పీఏసీఎస్ చైర్మన్ కైలాష్, ఎంఎంసీ చైర్‌పర్సన్ జ్యోతి, మెడికల్ ఆఫీసర్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట టూటౌన్ సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణానికి చెందిన తిరుపతికి గత నెల18వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మీ పూర్వ విద్యార్థిని, ప్రస్తుతం ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపాడు. క్యాంటీన్‌లో తక్కువ ధరకు ఎలక్ట్రానిక్ వస్తువులు అందుబాటులో ఉన్నాయని నమ్మబలికాడు. దీంతో గుర్తు తెలియని వ్యక్తి మాటలు నమ్మి బాధితుడు ఆన్‌లైన్‌లో రూ.45వేలు పంపించాడు. తర్వాత ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయినట్టుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఫోన్ నంబర్ ఆధారంగా దర్యాప్తు చేశారు. హైదారాబాద్‌లోని చందానగర్‌లో ఓ హాస్టల్‌లో ఉంటునట్టు గుర్తించారు. నారాయణపేట జిల్లా కోస్గి మండలం తొగపూర్ గ్రామానికి చెందిన తుడుం లక్ష్మణ్ (22)ను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. విచారణలో భాగంగా నిందితుడు సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో షాద్‌నగర్, యాదగిరిగుట్ట తదితర ప్రాంతాల్లో ఇదే తరహా నేరాలకు పాల్పడుతున్నట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌లు ఢీ : ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ దేవిరెడ్డి

దుబ్బాకటౌన్: పట్టణంలోని దుంపలపల్లి రోడ్డులో షాదీఖానా వద్ద బుధవారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీ కొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది ఎల్లప్ప, ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన దుస్తుల వ్యాపారి ఇంగు నాగభూషణం (55) రిజిస్ట్రేషన్ ఆఫీసుకు పని నిమిత్తం వెళుతున్నాడు. పెద్దగుండవెల్లికి చెందిన దేవిరెడ్డి దుబ్బాకకు వస్తుండగా రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు గాయపడ్డ వారిని 108అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

న్యాల్‌కల్(జహీరాబాద్): బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని గంగ్వార్ సమీపంలోని ఓ ఫంక్షన్ హల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని వివరించారు. ప్రతిఒక్కరూ బీఆర్‌ఎస్ బలోపేతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మెటల్‌కుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్‌ఎస్ నాయకుడు, సీనియర్ న్యాయవాది పాండురంగారెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రవీందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారుల పనులు ప్రారంభం

ఝరాసంగం (జహీరాబాద్): మండల పరిధిలోని ఎల్గోయి గ్రామం నుంచి జహీరాబాద్ మండలంలోని అల్గోల్ గ్రామం వరకు నిర్మించే రహదారి పనులను బుధవారం ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాచయ్యస్వామి, ప్రజాప్రతినిధులు ఓం ప్రకాష్‌పాటిల్, జగదీశ్వర్, విజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

మెదక్ జిల్లాలో గాయపడిన ఒకరు, ఆత్మహత్యకు యత్నించిన మరొకరు చికిత్స పొందుతూ మృతి చెందారు.



లక్ష్మణ్(ఫైల్)

పాపన్నపేట (మెదక్): చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ విజయకుమార్ కథనం ప్రకారం.. మండలపరిధిలోని డాక్యతండాకు చెందిన మునోత్ లక్ష్మణ్ (27) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబసభ్యుల పెళ్లిళ్లకు అప్పులు అయ్యాయి. అవి తీర్చలేక, ఆర్థిక ఇబ్బందులతో తరచు ఇంట్లో బాధ పడుతుండేవాడు. ఈ క్రమంలో మే 26వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తండా శివారులోని అటవీ ప్రాంతంలో పురుగు మందు సేవించి అక్కడే పడి ఉన్నాడు. బుధవారం అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా, మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడే ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

రెండు చేరిన మృతుల సంఖ్య



వెలమకన్నె కృష్ణ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చెందాడు. నర్సాపూర్ మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన వెలమకన్నె కృష్ణ (38) మే 25న నర్సాపూర్ నుంచి సంగారెడ్డి దారిలో ఉన్న రైస్‌మిల్‌కు ధాన్యం అమ్మేందుకు అడుగుదామని బుసగల్ల శ్రీనివాస్‌తో కలిసి బైకుపై వెళ్తుండగా ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఎదురుగా ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బుసగల్ల శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెలమకన్నె కృష్ణకు తీవ్రగాయాలు కాగా హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య పుష్ప, పిల్లలు కిరణ్, అపూర్వ ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో ఐదు రోజుల వ్యవధిలో ఇద్దరు మృతి చెందడంతో సీతారాంపూర్‌లో విషాదఛాయలు నెలకొన్నాయి.